క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే పురస్కరించుకుని అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ నేత్ర, దంత వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు సందర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం నగరంలోని కండ్రిక, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న ఇమ్యునైజేషన్‌ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మహేశ్వరరావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్రైమ్ థ్రిల్లర్ మూవీ కలియుగం పట్టణంలో



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 29న విడుదల కానున్న కలియుగం పట్టణంలో సినిమా క్రైమ్ థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్‌తో అందరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విశ్వకార్తికేయ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విశ్వ కార్తికేయ మాట్లాడారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో తమ చిత్రం ప్రమోషన్‌ను ప్రారంభించామని తెలిపారు. కళాశాల విద్యార్థులతో చిత్ర విశేషాలు ముచ్చటించినట్లు చెప్పారు. వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాలనటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించానన్నారు. ఎన్నో క్రైమ్ సినిమాలు వచ్చి ఉంటాయని, కానీ వాటన్నింటికీ విభిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. ప్రేక్షకులు తప్పక ఆదరించాలన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సహ హీరో నరేన్‌రామ్ దర్శకుడు రమణ కాంత్‌రెడ్డి, నిర్మాత మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడుసర్కిల్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకంలో భాగంగా పైపులైన్ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. పైపులైన్ పూర్తయ్యినప్పటికీ పంపింగ్ స్టేషన్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవటంతో పనులు నిలిచిపోయాయి. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి అధికారులతో మాట్లాడి ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లో పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం యూజీడీ పంపింగ్‌స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. యూజీడీ పంపింగ్‌స్టేషన్ వినియోగంలోకి వస్తే గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలలో దోమలు, మురుగు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

అభివృద్ధి పథంలో 63వ డివిజన్

- కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు నిర్వహణ
- ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న డివిజన్‌వాసులు



63వ డివిజన్లో సుందరంగా నిర్మించిన పార్కు



రాజీవ్‌నగర్లో నూతనంగా నిర్మించిన ఓపెన్ దయాస్



ఈడబ్ల్యుఎస్ కాలనీ లో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు (ఫైల్)

ఇది కదా.. అభివృద్ధి

పాయకాపురం(విజయవాడరూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సెంట్రల్ నియోజకవర్గంలోని ఆయా డివిజన్లు ఎంతో అభివృద్ధి చెందాయి. గతంలో టీడీపీ ఐదేళ్ల పాలన ఈ ప్రాంత ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడలేదు. కానీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. జగనన్న హయాంలో డివిజన్ వ్యాప్తంగా రూ.15 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 కోట్ల వ్యయంతో హోసన్నా ప్రార్థనా మందిరం రోడ్డు, రూ.1.20 కోట్ల వ్యయంతో డాక్టర్స్ కాలనీ రోడ్లను నిర్మించారు. ఈడబ్ల్యుఎస్ కాలనీలో రూ. 1.50 కోట్ల వీఎంసీ సాధారణ నిధులతో రహదారులు నిర్మించారు. రూ.80 లక్షలతో ఎల్‌ఐజీ-1, 2, ఎంఐజీ కాలనీల్లో రోడ్లు నిర్మించారు. అలాగే 6 వార్డు సచివాలయాల పరిధిలో మంజూరైన రూ.1.20 కోట్ల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రాధానగర్ కాలేజీ రోడ్లు, ఎన్జీఓఎస్ ఈ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, షణ్ముఖ వాటర్ ప్లాంట్ రోడ్డు, మాస్టర్ మైండ్స్ స్కూల్ రోడ్డు సహా అనేక రహదారులకు మోక్షం లభించింది. రూ.50 లక్షల సీఆర్డీఏ నిధులతో ఎల్‌ఐజీ-1, 2, కాలనీల్లో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు సుందరయ్యనగర్లో రూ.30 లక్షలతో పైపులైన్ల వ్యవస్థను మెరుగుపర్చారు. ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

అందరికి అందుబాటులో ఓపెన్ దయాస్...
సుమారు 300 కుటుంబాలు నివాసం వుండే విశాలాంధ్ర కాలనీలో శుభకార్యాలు చేసుకునేందుకు కల్యాణ మండపం లేకపోవడంతో కొంత మంది రోడ్లపైన, మరికొంత మంది దూరప్రాంతాలకు వెళ్లి జరుపుకోవాల్సి వచ్చేది. దీంతో స్థానికుల అవసరాల దృష్ట్యా ఈ ప్రాంతంలో రూ.21.40 లక్షలతో ఓపెన్ దయాస్ నిర్మించారు. ఈ ప్రదేశం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండేది. కానీ నేడు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవడంతో ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభించింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఉపకేంద్రం నిర్మాణం....
ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అత్యాధునిక విద్యుత్ ఉపకేంద్రాలను ఈ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. కానీ ఈ ప్రభుత్వంలో రూ.5 కోట్లతో ఉడా కాలనీలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించుకోవడంతో ఈ ప్రాంతంలో సుమారు 7,500 కుటుంబాలకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు మార్గం సుగమం అయింది.

ఆహ్లాదాన్ని పంచేలా పార్కుల సుందరీకరణ....
ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం అందించేలా ఈ ప్రాంతంలో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సుందరయ్యనగర్ పార్కులో రూ.80 లక్షలతో ఓపెన్ జిమ్, విశాలమైన వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. రూ.14 లక్షలతో తెలుగుతల్లి పార్కును అందంగా తీర్చిదిద్దారు. ఉడా కాలనీలో రూ.75 లక్షలతో రెండు పార్కులను అభివృద్ధి చేశారు. సాయిబాబా గుడి వద్ద పార్కును విశాలమైన వాకింగ్ ట్రాక్ ఓపెన్ జిమ్ చిన్నారులకు ఆట వస్తువులు, డెకరేటివ్ లైటింగ్ పోల్స్, పచ్చని గార్డెనింగ్‌తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఉడాకాలనీలోని మరో వీఎంసీ పార్కులో వాకింగ్ ట్రాక్, డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రీనరీని అభివృద్ధి చేశారు. ఈడబ్ల్యుఎస్ కాలనీ 5వ లైన్లోని పార్కును రూ.75 లక్షలతో అభివృద్ధి పరిచి, వాకింగ్ ట్రాక్, డెకరేటివ్ లైటింగ్ తో పాటు గ్రీనరీని అభివృద్ధి చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్లో పార్కుల పనులు శరవేగంగా పూర్తి చేశారు. అలాగే రాజీవ్‌నగర్లో డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ ప్రాంగాణాన్ని (రూ.22 లక్షలతో) ఫెన్సింగ్ తో పరిరక్షించి గ్రీనరీని అభివృద్ధి చేశారు. రూ.11.07 లక్షలతో పార్కు సూపర్ వైజర్ గది నిర్మాణానికి ఇటీవల భూమిపూజ చేశారు. డివిజన్లో 31 మందికి రూ.19.76 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు.

ఎన్నో అభివృద్ధి పనులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. గత ఐదేళ్ళలో రూ.15 కోట్ల మేరకు డివిజన్‌లో అభివృద్ధి చేశాం.

–మల్లాది విష్ణు, ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గం

ప్రణాళికతో డివిజన్లో అభివృద్ధి



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరిగాయి. గత పాలకులు డివిజన్‌ను గాలికి వదిలేస్తే ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల గ్రాంటును తీసుకొచ్చి అభివృద్ధి పనులు నిర్వహించారు.

–పసుపులేటి యేసు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయండి



కరపత్రాలు పంపిణీచేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాసెంట్రల్): తాము చేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని, ఫ్యాను గుర్తుకు ఓటు అభివృద్ధి, సంక్షేమానికి చోటు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 32వ డివిజన్ అయోధ్య నగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లో బుధవారం పర్యటించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్‌తో కలిసి లోటస్ ల్యాండ్ మార్క్ అసోసియేషన్ నేతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు హారతులు ఇస్తూ శాలువా కప్పి వెలంపల్లి శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికారు.
గాజువాక, భీమవరంలో ఓడిపోయిన పవన్ కళ్యాణ్‌కి ఓటమి కొత్త కాదన్నారు. వంగా గీత చేతిలో పవనకు ఓటమి తప్పదని చెప్పారు. మోడీ చెప్పేది మాత్రమే చేసే పవన్‌కు పార్టీ ఎందుకు అని ప్రశ్నించారు. ఎన్నికల తరువాత బీజేపీలో జనసేన విలీనం కాబోతుందని తెలిపారు. ప్రజల విశ్వసనీయత కోల్పోయిన చంద్రబాబు , లోకేష్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. విశ్వసనీయతకు మారుపేరుగా జగనన్న ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చెప్పారు. 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి, 32వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంస్‌ఆర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి డివిజన్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బొండా ఉమాను ఓడించి తీరుతాం



హోటల్‌లో సమావేశమైన టీడీపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు

ఉమాకు వ్యతిరేకంగా సమావేశమైన టీడీపీ మాజీ కార్పొరేటర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీలో చిచ్చురాజుకుంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుపై ఆపార్టీ మాజీ కార్పొరేటర్లు యుద్ధం ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఉమాను కచ్చితంగా ఓడించి తీరుతామని ప్రతిన బూనారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్‌లో రహస్యంగా సమావేశమయ్యారు. తమకు ఉమా చేతిలో జరిగిన అవమానాలు, అన్యాయం గురించి ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా బొండా ఉమా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన సాగించిన భూ కబ్జాలు, దౌర్జన్యాలు, ఉమా కుమారులు సాగించిన కారు రేస్‌లు, విదేశాల్లో ఉద్యోగాల పేరిట వసూళ్లు, నకిలీ ఎమ్మెల్యే, ఎంపీ కారు స్టిక్కర్లతో హల్ చల్ చేయడం వంటి విషయాలపై చర్చించారు. సొంత పార్టీ నేతలను కాదని గత కార్పొరేషన్ ఎన్నికల్లో వేరేవారికి సీట్లు పెద్ద ఎత్తున అమ్ముకున్నాడని, భవిష్యత్తులో తనకు ముప్పు అని భావించి కొన్ని సామాజిక వర్గాలకు చెందిన సీనియర్ కార్పొరేటర్ అభ్యర్థులను ఓడించాడని కొందరు సమావేశంలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. కొందరు తమను ఏదైనా చేస్తాడేమోనన్న ఆందోళనలో ఉన్నారు. మరికొందరు తమకు జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకునే సమయం వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉమా గెలవకూడదని నిర్ణయం తీసుకున్నారు. బోండా ఉమాపై నియోజకవర్గంలో పూర్తిగా వ్యతిరేకత ఉన్నప్పటికీ నివేదికలను మార్చు చేసి సీటు సాధించాడని, ఈ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని, మరో అభ్యర్థిని బరిలో దించాలని అధిష్ఠానాన్ని కోరనున్నట్లు తెలిసింది. ఇప్పటికే చంద్రబాబు అపాయింట్ మెంట్ కోరామని, బొండా ఉమా అవినీతి మొత్తం చంద్రబాబుకు వివరిస్తామని సమావేశంలో పాల్గొన్న సీనియర్ టీడీపీ నేత తెలిపారు. ఉమానే అభ్యర్థిగా కొనసాగిస్తే కచ్చితంగా ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. హోటల్‌లో సమావేశమైన వారిలో టీడీపీ మాజీ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ నందేపు జగదీష్, మాజీ కార్పొరేటర్లు గండూరి మహేష్, కోడెబోయిన దుర్గా భవాని, బుగతా ఉమామహేశ్వరి, కాకు మల్లికార్జున్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కోసూరి శైలజ భర్త కోసూరి మణి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు కొక్కిలిగడ్డ దేవమణి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు సేవలందించాలి


పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం, మైనార్టీలకు సేవలందించాలనుకొనే యువతకు ఆజాద్ ముస్లిం కమిటీ స్వాగతం పలుకుతోందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. 63వ డివిజన్లో ముస్లిం, మైనార్టీల సమావేశం సెంట్రల్ యూత్ అధ్యక్షుడు ఎం.అన్వర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగుల్ మీరా మాట్లాడుతూ యువత ద్వారా ముస్లిం మైనార్టీలకు సేవలు మరింత అందించాలనే ఉద్దేశంతో యూత్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆజాద్ ముస్లిం కమిటీ అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. సెంట్రల్ యూత్ కార్యదర్శి షేక్ అమీర్, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ సాదిక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అమీన్‌లకు నియామక పత్రాలు అందచేశారు. ఆజాద్ ముస్లిం కమిటీ చేస్తున్న సేవలను వివరించి పెద్ద ఎత్తున యూత్‌ను సభ్యులుగా చేర్పించాలని సూచించారు. సమావేశంలో సెంట్రల్ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఎం.సర్వర్ బేగ్, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించాలని వినతి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, అఫిలియేటెడ్ డిగ్రీ కళాశాలలకు మే ఒకటో తేదీ నుంచి రెండు నెలలు వేసవి సెలవులు ప్రకటించాలంటూ బుధవారం జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్, జీసీటీఏ నాయకులు లలితారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌లకు వినతి పత్ర అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వారు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు జారీ చేసిన అధికారిక అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రెండు నెలల వేసవి సెలవులను రాష్ట్రంలోని యూనివర్సిటీలు ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ వంటి పెద్ద కళాశాలలో రీసెర్చ్ సెంటర్లను అవసరమైన సబ్జెక్టులకు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాముడు, ముప్పా పద్మనాభం, జి. లుముంబా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ డాక్టర్ కె. శోభన బాబుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీఎస్ఆర్ఎంసీ పాఠశాలను తనిఖీ చేసిన డీసీపీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): జిల్లాలోని పదో తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశామని డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. నగరంలోని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ (ఏపీఎస్ఆర్ఎంసీ) పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ అధికారులకు, పరీక్షా కేంద్రాల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 178 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఐపీఎస్ స్థాయి అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ.మురళీకృష్ణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీ కండువాలు కప్పి మహిళలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 63వ డివిజన్‌కు చెందిన 100 మంది మహిళలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ మహిళలకు అసలైన గుర్తింపు, ప్రోత్సాహం అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. రాష్ట్రంలోని మహిళల సొంత బిడ్డలా, అన్నలా, తమ్ముడిలా మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం అందించినా మహిళల పేర్ల మీదే అమలు చేశారని పేర్కొన్నారు. మహిళా లోకమంతా జగనన్నకు అండగా నిలవడం సంతోషదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు జలసూత్రం శ్రీనివాసరావు, మోదుగుల గణేష్, కాశీం, పప్పీ, షబీనాబీ, పద్మావతి, సంతోషమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.